ఒకేసారి కేటీఎం పది బైకులు

గరిష్ఠ ధర రూ. 22.96 లక్షలు

న్యూఢిల్లీ, నవంబర్ 14: బజాజ్ ఆటోకు చెందిన విదేశీ బ్రాండ్ కేటీఎం ఒకేసారి భారతీయ మార్కెట్లోకి పది బైకులను విడుదల చేసింది. నాలుగు సెగ్మెంట్లలో లభించనున్న ఈ బైకులు రూ.4.75 లక్షలు మొదలుకొని రూ.22.96 లక్షల గరిష్ఠ స్థాయి ధరల్లో లభించనున్నాయి. భారత్‌లో స్పోర్ట్ బైకులకు డిమాండ్ అధికంగా ఉన్నదని, రెడీ టూ రేస్ నినాదంతో దేశంలో అన్నిరకాల బైకులను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు సంస్థ వర్గాలు చెప్తున్నాయి.

ఎస్బీఐ వడ్డీరేట్ల పెంపు

ముంబై, నవంబర్ 14: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ రుణ గ్రహీతలకు షాకిచ్చింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్-బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని ఐదు బేసిస్ పాయింట్లు పెంచింది. ఎంపిక చేసిన కాలపరిమితి కలిగిన రుణాలపై మాత్రమే వడ్డీరేట్లను సవరించింది. దీంట్లోభాగంగా ఏడాది కాలపరిమితితో తీసుకునే రుణాలపై వడ్డీరేటును 0.05 శాతం సవరించడంతో రేటు 9 శాతానికి చేరుకున్నది. ఈ రేట్లు శుక్రవారం నుంచి అమలులోకి రానున్నట్లు పేర్కొంది. మూడు, ఆరేండ్ల కాలపరిమితితో తీసుకునే రుణాలపై వడ్డీరేటును ఐదు బేసిస్ పాయింట్లు సవరించిన బ్యాంక్.. నెల, రెండేండ్లు, మూడేండ్ల రుణాలపై వడ్డీని యథాతథంగా ఉంచింది. గత కొన్నిరోజుల్లో ఎంసీఎల్ఆర్‌ని రెండు సార్లు సవరించింది.

టోకు ధరలూ పైపైకే..

అక్టోబర్‌లో 4 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 2.36 శాతంగా నమోదు

న్యూఢిల్లీ, నవంబర్ 14: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం గణాంకాలూ పెరిగాయి. గత నెలలో 4 నెలల గరిష్ఠాన్ని తాకినట్టు గురువారం విడుదలైన ప్రభుత్వ వివరాల్లో తేలింది. అక్టోబర్‌లో హోల్‌సేల్ ద్రవ్యోల్బణం 2.36 శాతంగా నమోదైనట్టు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఈ ఏడాది జూన్ (3.43 శాతం) తర్వాత ఇదే అత్యధికం. సెప్టెంబర్‌లో 1.84 శాతంగానే ఉన్నది. నిరుడు అక్టోబర్‌లోనైతే మైనస్ 0.26 శాతమే కావడం గమనార్హం. ఇక ఇప్పటికే అక్టోబర్ నెలకుగాను రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 14 నెలల గరిష్ఠ స్థాయిని తాకుతూ 6.21 శాతంగా నమోదైన విషయం తెలిసిందే. ఇది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రిటైల్ ఇన్‌ఫ్లేషన్ కట్టడికి పెట్టుకున్న గరిష్ఠ సహన పరిమితి (6 శాతం) కంటే ఎక్కువ.

ఆహార ధరలే కారణం

కూరగాయలు తదితర ఆహారోత్పత్తుల ధరలు విపరీతంగా పెరిగినట్లు అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. తయారీ వస్తూత్పత్తుల రేట్లూ పరుగులు పెట్టాయని స్పష్టమైంది. ఈ క్రమంలోనే హోల్‌సేల్ మార్కెట్‌లో ఆహారోత్పత్తుల ధరల సూచీ అక్టోబర్‌లో 13.54 శాతానికి ఎగిసింది. అంతకుముందు నెల సెప్టెంబర్‌లో ఇది 11.53 శాతంగా ఉన్నది. కూరగాయల ధరల్లో 63.04 శాతం పెరుగుదల కనిపిస్తున్నది. సెప్టెంబర్‌లో ఇది 48.73 శాతం. ముఖ్యంగా ఆలుగడ్డ, ఉల్లిగడ్డ ధరలు 78.73 శాతం, 39.25 శాతం శ్రేణిలోనే కదలాడుతున్నాయి. కాగా, రిటైల్ మార్కెట్‌లో ఆహారోత్పత్తుల ధరల సూచీ (సీఎఫ్‌పీఐ) 10.87 శాతానికి ఎగబాకింది.

వడ్డీరేట్ల కోతలకు బ్రేక్?

అటు రిటైల్ ద్రవ్యోల్బణం, ఇటు హోల్‌సేల్ ద్రవ్యోల్బణం.. రెండూ భారీగా పెరిగిన నేపథ్యంలో ఆర్బీఐ వడ్డీరేట్ల కోతల అంచనాలకు బ్రేక్ పడినట్టైంది. గత నెల్లోనే ఆర్బీఐ తమ మానిటరీ పాలసీని న్యూట్రల్‌కు మార్చింది. ఫలితంగా వచ్చే ద్రవ్యసమీక్షల్లో కీలక వడ్డీరేట్లు ఇక తగ్గే అవకాశాలే ఉన్నాయని అంతా అనుకున్నారు. కానీ తాజా ద్రవ్యోల్బణ గణాంకాలు ఈ ఆశలపై నీళ్లు చల్లినట్టైంది. డిసెంబర్‌లో జరుగబోయే ద్రవ్యసమీక్షలోనూ రెపో రేటు యథాతథంగానే ఉండొచ్చంటున్నారు. ఇంకొందరైతే పెరిగేందుకూ ఆస్కారముందన్న అంచనాల్ని వెలిబుచ్చుతున్నారు. ఇదే జరిగితే కీలక రంగాలపై పెను భారం పడినట్టే. కరోనాతో చతికిలపడిన దేశ ఆర్థిక వ్యవస్థలో తిరిగి ఉత్సాహాన్ని నింపేందుకు వరుసగా వడ్డీరేట్లను తగ్గిస్తూపోయిన ఆర్బీఐ.. ఆ తర్వాత విజృంభించిన ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు అదే రీతిలో పెంచుతూపోయిన విషయం తెలిసిందే. ఆపై గత ఏడాది ఏప్రిల్ నుంచి గరిష్ఠ స్థాయిల్లోనే రెపో రేటు (6.50 శాతం)ను ఉంచుతూ వస్తున్నది. మొత్తానికి పెరుగుతున్న ద్రవ్యోల్బణం.. ఆర్బీఐ వడ్డీరేట్ల కోతలకున్న అవకాశాల్ని మరికొన్ని నెలలు వెనక్కి నెడుతున్నదని చెప్పక తప్పదు.

రూపీ మరో 7 పైసలు డౌన్

ముంబై, నవంబర్ 14: రూపాయి పతనం కొనసాగుతున్నది. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో ఇతర కరెన్సీలు నేలచూపు చూస్తున్నాయి. దీంట్లోభాగంగానే దేశీయ కరెన్సీ విలువ మరో చారిత్రక కనిష్ఠ స్థాయికి జారుకున్నది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 7 పైసలు తగ్గి మునుపెన్నడు కనిష్ఠ స్థాయి 84.46కి పడిపోయింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటుండటం, డాలర్‌కు డిమాండ్ ఉండటం వల్లనే రూపాయి విలువ మరింత పతనం చెందిందని ఫారెక్స్ ట్రేడర్ వెల్లడించారు.

మరింత తగ్గిన బంగారం

తులంపై రూ.700 దిగిన ధర

న్యూఢిల్లీ, నవంబర్ 14: రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలు అంతే స్పీడ్‌తో కిందకు దిగొస్తున్నాయి. అంతర్జాతీయంగా, దేశీయంగా కొనుగోళ్లే డిమాండ్ పడిపోవడంతో ధరలు మరింత తగ్గాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లోతులం పుత్తడి ధర రూ.700 దిగొచ్చి రూ.77 వేల స్థాయికి చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.77,750గా ఉన్నది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం బంగారం ధర రూ.1,200 దిగి రూ.75,650కి తగ్గింది. అలాగే 22 క్యారెట్ ధర రూ.1,100 తగ్గి రూ.70 వేల దిగువకు పడిపోయింది. బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి రూ.69,350గా నమోదైంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోవడంతో కిలో వెండి రూ.2,310 తగ్గి రూ.90,190కి పరిమితమైంది. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.2,000 తగ్గి రూ.99 వేలుగా నమోదైంది. ఫ్యూచర్ ట్రేడ్ మార్కెట్లో డిసెంబర్ డెలివరీకిగాను బంగారం ధర రూ.800 తగ్గి రూ.73,678కి చేరుకున్నది. అమెరికా ధరల సూచీ గణాంకాలు విడుదలకావడంతో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొన్నదని, అలాగే ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం కూడా బంగారం ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది తెలిపారు. గోల్డ్ ఫ్యూచర్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 29.10 డాలర్లు తగ్గి రెండు నెలల కనిష్ఠ స్థాయి 2,557.40 డాలర్లకు పడిపోయింది.

రెండు నెలల్లో లైఫ్ సైన్సెస్ పాలసీ

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): వచ్చే రెండు నెలల్లో లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించే అవకాశాలున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఫార్మా హబ్‌గా కొనసాగుతున్న తెలంగాణలో లైఫ్ సెన్సెస్‌కు సంబంధించిన దేశ, విదేశీ కంపెనీలను ఆకట్టుకోవడానికే ఇదన్నారు. దేశంలో ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో కొత్త కంపెనీలకు హైదరాబాద్ కేంద్ర బిందువుగా మారిపోయిందని, ఇదే ఒరవడిని కొనసాగించడానికి పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రత్యేక పాలసీని రూపొందిస్తున్నట్లు తెలిపారు.

36 వేల కోట్ల పెట్టుబడులు

గత పది నెలల్లోనే రాష్ట్ర లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగంలో రూ.36 వేల కోట్ల విలువైన పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఒకేచోట కాకుండా పలు ప్రాంతాల్లో ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఆధునిక కాలుష్య నియంత్రణతో ప్లాంట్లు ఏర్పాటుచేసేలా సంస్థలను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు.

డిమాండ్లు నెరవేర్చాకే భూసేకరణ

ఫార్మా క్లస్టర్ల భూ సేకరణలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తున్నదని శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించి, వారు అంగీకరించిన తర్వాతే పనులు చేపడతామని, సమస్యలేమైనా ఉంటే రైతులు అధికారులకు తెలియజేయాలని శ్రీధర్‌బాబు కోరారు.

ఎగుమతులు పెరిగాయ్ కానీ..

న్యూఢిల్లీ, నవంబర్ 14: దేశీయ వాణిజ్య ఎగుమతులు గత నెల అక్టోబర్‌లో నిరుడుతో పోల్చితే 17.25 శాతం పెరిగి రెండేండ్ల గరిష్ఠాన్ని తాకుతూ 39.2 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అయితే వాణిజ్య లోటు కూడా 27.14 బిలియన్ డాలర్లకు పెరగడం గమనార్హం. సెప్టెంబర్‌లో ఇది 20.78 బిలియన్ డాలర్లే. ఎగుమతులు-దిగుమతుల మధ్యగల వ్యత్యాసాన్నే వాణిజ్య లోటు అంటారన్న విషయం తెలిసిందే. గురువారం విడుదలైన కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం గత నెలలో దేశంలోకి వచ్చిన దిగుమతుల విలువ 66.34 బిలియన్ డాలర్లు. గత ఏడాది ఇదే నెలతో చూస్తే 3.9 శాతం ఎక్కువ. కాగా, ముడిచమురు దిగుమతులు 13.34 శాతం పెరగడమే ఇందుకు కారణమని చెప్తున్నారు. మరోవైపు ఏప్రిల్-అక్టోబర్‌లో చైనా దిగుమతులు 65.89 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. నిరుడుతో పోల్చితే 9.8 శాతం పెరగడం గమనార్హం. మరోవైపు ఇదే సమయంలో చైనాకు భారతీయ ఎగుమతులు 9.37 శాతం పడిపోయి 8 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అయితే అమెరికాకు 6.31 శాతం ఎగిసి 47.24 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

బ్యాంకుల్లో మళ్లీ 5 రోజుల పని డిమాండ్

న్యూఢిల్లీ, నవంబర్ 14: బ్యాంకింగ్ రంగంలో ఎప్పట్నుంచో వినిపిస్తున్న వారంలో 5 రోజుల పని దినాల డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది. అఖిల భారత బ్యాంక్ అధికారుల సమాఖ్య (ఏఐబీవోసీ) గురువారం దీన్ని వినిపించింది. ఆదివారానికి తోడు శనివారం కూడా సెలవు ఇవ్వాలని, భారతీయ బ్యాంకుల సంఘం (ఐబీఏ) ఇప్పటికే దీన్ని ప్రభుత్వానికి సిఫార్సు చేసిందంటూ కేంద్ర ఆర్థిక సేవల శాఖకు రాసిన ఓ లేఖలో ఏఐబీవోసీ గుర్తుచేసింది. దీంతో పాటు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాళీలను భర్తీ చేసి సిబ్బంది కొరతను తీర్చాలని, బ్యాంక్ ఉద్యోగులపై హింసాత్మక దాడులు జరుగుతున్నాయన్నది. రాజకీయ నేపథ్యం ఉన్న కొందరు.. బ్యాంక్ లోపల, వెలుపలా సిబ్బందిపై దాడులకు తెగబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది.

అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం
1వ అంతస్తు, "కార్పొరేట్ భవన్", బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500 068.
ఫోన్ నెం.లు 040-29803086/3186. ఇ-మెయిల్ : ol.hyderabad@mca.gov.in

ఫారం నెం. 63
[రూల్ 148(1) చూడండి]
గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో : అమరావతి వద్ద (ప్రారంభ అధికార పరిధి)
కంపెనీల చట్టం, 1956 విషయంలో
మరియు
Esskay షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో కలదు) విషయంలో
C.P.No. 201/2015
తమ క్లెయిమ్‌ను నిరూపించుటకు క్రెడిటార్లకు (కార్మికులతో సహా) నోటీస్ ప్రకటన

పైన తెలిపిన కంపెనీ (లిక్విడేషన్‌లో కలదు) యొక్క క్రెడిటార్లకు (కార్మికులతో సహా) తెలియజేయునది ఏమనగా, కంపెనీల చట్టం 1956 సెక్షన్ 530 క్రింద ప్రాధాన్యం ఇచ్చుటకు వారి సంబంధిత పేర్లు, చిరునామాలు మరియు డెట్ లేదా క్లెయిమ్ మరియు ఏదేని ట్టిటిల్ వివరాలతో నిర్ణీత ఫారంలో సదరు డెట్ లేదా క్లెయిమ్‌ను నిరూపించు అఫిడవిట్‌తో 16 డిసెంబర్, 2024న లేదా ఆలోగా అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం, 1వ అంతస్తు, ''కార్పొరేట్ భవన్'', బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500 068 వద్ద బట్వాడా లేదా సదరు తేదీ లోగా అతనికి చేరు విధంగా అఫీషియల్ లిక్విడేటర్‌కు పోస్ట్ ద్వారా పంపించి పైన తెలిపిన కంపెనీపై వారి సంబంధిత డెట్స్ లేదా క్లెయిమ్‌ల రుజువులను తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం యొక్క అఫీషియల్ లిక్విడేటర్‌కు దాఖలు చేయవలసిందిగా వారికి తెలియజేయడమైనది. ఎవరేని క్రెడిటార్ పైన తెలిపిన విధంగా పరిమిత కాల వ్యవధిలోగా అతని/ఆమె/వారి అఫిడవిట్ రుజువును దాఖలు చేయుటలో విఫలమైతే అతని/ఆమె/వారి డెట్ రుజువు ముందు లేదా సందర్భాన్ని బట్టి సదరు పంపిణీ నుండి డివిడెండ్ పంపిణీ ప్రయోజనం నుండి మినహాయించబడును.

అఫీషియల్ లిక్విడేటర్ నుండి ప్రాతపూర్వకంగా నోటీస్ ద్వారా అతని/ఆమె/వారి రుజువును పంపిన ఎవరేని క్రెడిటార్ (కార్మికులతో సహా) స్వయంగా లేదా అతని/ఆమె/వారి అడ్వకేట్ ద్వారా సదరు నోటీస్‌లో తెలిపిన సదరు సమయం మరియు ప్రదేశం వద్ద సదరు డెట్ లేదా క్లెయిమ్ విచారణకు హాజరు కావలెను మరియు అతని/ఆమె/వారి డెట్ లేదా క్లెయిమ్‌కు అవసరమైన తదుపరి సాక్ష్యాలను దాఖలు చేయవలెను.

తేదీ: 11 నవంబర్, 2024.
సం/-
(U.K. సాహూ, ICLS)
అఫీషియల్ లిక్విడేటర్,
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్.

గమనిక: నోటరీ చేయబడిన రూ. 20/- నాన్-జుడీషియల్ స్టాంప్ పేపర్‌పై కంపెనీల చట్టం (కోర్ట్) రూల్స్, 1959 లోని రూల్ 151, 152 మరియు ఇతర వర్తించు రూల్స్ క్రింద మద్దతునిచ్చే డాక్యుమెంట్లతో సహా సందర్భాన్నిబట్టి ఫారం నెం. 66 లేదా ఫారం నెం. 67లో క్లెయిమ్‌ను దాఖలు చేయవలెను.

అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం
1వ అంతస్తు, "కార్పొరేట్ భవన్", బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500068.
ఫోన్ నం.లు 040-29803086/3186. ఇ-మెయిల్ : ol.hyderabad@mca.gov.in

గౌరవనీయ తెలంగాణ ఉన్నత న్యాయస్థానంలో: హైదరాబాద్ వద్ద (ప్రారంభ అధికారపరిధి)
కంపెనీల చట్టం, 1956 విషయంలో
M/s. భాగ్యనగర్ సిల్క్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో కలదు) విషయంలో
కంపెనీ పిటిషన్ నం. 104/2006
ఇ-వేలం ద్వారా అసెట్లు/ఆస్తుల అమ్మకం కొరకు ప్రకటన

C.A.No.10/2024లో గౌరవనీయ తెలంగాణ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్ వద్ద తేదీ: 13.09.2024 గల ఉత్తర్వులు ప్రకారం, కాగోరు కొనుగోలుదారులు నుండి ''**ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా మరియు అక్కడ ఏమున్నదో అదే ప్రాతిపదిక**''పై కంపెనీ (లిక్విడేషన్‌లో కలదు) యొక్క దిగువ అసెట్లు/ఆస్తుల అమ్మకానికి సంబంధించి ఇ-టెండర్లు కోరబడుచున్నవి.

అసెట్లు/ఆస్తులు, రిజర్వు ధర, బయానా మరియు బిడ్ పెంపుదల మొత్తం యొక్క వివరాలు దిగువ విధంగా ఉన్నవి:

అసెట్లు/ఆస్తుల యొక్క లాట్ నం. మరియు వివరణ	రిజర్వు ధర (రూ.లక్షలలో)	బయానా(EMD) (రూ.లక్షలలో)	బిడ్ పెంపుదల మొత్తం (రూ.లక్షలలో)
లాట్ నం.1: తెలంగాణ, మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, ఐడిఎ జీడిమెట్ల గ్రామం, ఫేజ్-Iలో సర్వే నెం.252(పార్ట్), 253 (పార్ట్) మరియు 254 (పార్ట్)లో F-8 (A & B) వద్ద గల 3240.37 చ.గజాలు విస్తీర్ణపు ఇండస్ట్రియల్ భూమితోపాటు షెడ్స్ (పాతవి మరియు శిథిలమైన స్థితిలో)	1033	103.3 (వడ్డీ చెల్లించబడదు)	2
లాట్ నం.2 : తెలంగాణ, మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, ఐడిఎ జీడిమెట్ల గ్రామం, ఫేజ్-Iలో సర్వే నెం.252(పార్ట్), 253 (పార్ట్) మరియు 254 (పార్ట్)లో F-2 (A & B) & F-4 (A & B) వద్ద గల 6680.56 చ.గజాలు విస్తీర్ణపు ఇండస్ట్రియల్ భూమితోపాటు షెడ్స్ (పాతవి మరియు శిథిలమైన స్థితిలో)	1846	184.6 (వడ్డీ చెల్లించబడదు)	3

గమనిక: i) 02.12.2024 & 03.12.2024 **తేదీలలో ఉ.** 11.00 గం. **నుండి సా.** 5.00 గం.మధ్య తెలంగాణ, మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, ఐడిఎ జీడిమెట్ల గ్రామం, ఫేజ్-I వద్ద గల పై అసెట్లు/ఆస్తులను తనిఖీ చేసుకోవచ్చు.

ii) ఆన్‌లైన్ ఇ-వేలంలో పాల్గొనుటకు టెండరుదారులు **అఫీషియల్ లిక్విడేటర్ అకౌంట్** అనగా **"EMD ACCOUNT"**, కరెంట్ అకౌంట్ **No.0207002100146966**, పంజాబ్ నేషనల్ బ్యాంక్, **ట్రూప్ బజార్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్, IFS కోడ్: PUNB0020700**లో RTGS/NEFT విధానం ద్వారా **రూ.** 2,000/- **(రూపాయలు రెండు వేలు మాత్రమే)** ప్రతి లాటుకి వాపసు ఇవ్వబడని మరియు సర్దుబాటు చేయబడని ఇ-వేలం పార్టిసిపేషన్ రుసుము మరియు పైన తెలిపిన **బయానా మొత్తం (వడ్డీ లేదు)** చెల్లించాల్సి వుంటుంది. పార్టిసిపేషన్ రుసుము మరియు బయానా మొత్తం డిపాజిట్ చేయుటకు ఆఖరి తేదీ **16.12.2024న సా.** 4.00 **గం. వరకు.** మరియు మద్దతు డాక్యుమెంట్లతో పాటు ఆన్‌లైన్ ఆఫర్ /బిడ్ ఫారం దాఖలు చేయుటకు ఆఖరి తేదీ 17.12.2024**న సా.** 4.00 **గం.వరకు.**

iii) టెండరుదార్లు వెబ్‌సైట్: **https://ol.auctiontiger.net** ద్వారా తమ ఆన్‌లైన్ ఆఫర్ దాఖలు చేయాలి. అఫీషియల్ లిక్విడేటర్ వారు ఇంటర్నెట్ కనెక్టివిటీ సమస్య, నెట్‌వర్క్ సమస్య, సిస్టమ్ క్రాష్ డౌన్, విద్యుత్ వైఫల్యం మరియు అటువంటి ఇతర కారణాలకు బాధ్యత వహించరు.

iv) ఇ-వేలం గురించి వివరాలు/ సహాయం/విధానం/ఆన్‌లైన్ శిక్షణ కొరకు కాగోరు బిడ్డర్లు **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆక్షన్ టైగర్)** కస్టమర్ కేర్ నంబర్‌పై సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించవచ్చును. **మొబైల్ నం.** +91 9722778828.

v) పై ఆస్తుల/ అస్సెట్ల ఇ-వేలం/ బిడ్డింగ్ అర్హత గల బిడ్డర్ల మధ్య ఆన్‌లైన్ ఇంటర్-సె-బిడ్డింగ్ ద్వారా నిర్వహించబడును. సదరు బిడ్డర్లు ''బిడ్ ఇంక్రిమెంట్ అమౌంట్'' ద్వారా వారి ఆఫర్‌ను పెంచవచ్చును.

vi) ఇ-వేలం వెబ్‌సైట్ **https://ol.auctiontiger.net** ద్వారా ఇ-వేలం అమ్మకం పూర్తి అయ్యేముందు చివరి నిమిషంలో బిడ్ వేయబడితే ప్రతిసారీ 10 నిమిషాల ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్‌తో **19.12.2024న ఉ.** 11.30 **గం. నుండి మ.** 2.30 **గం.** మధ్య నిర్వహించబడుతుంది.

vii) అమ్మకం గౌరవనీయ తెలంగాణ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్ యొక్క నిర్దారణకు లోబడి ఉంటుంది. అఫీషియల్ లిక్విడేటర్ మరియు గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం ఎటువంటి కారణాలు తెలుపకుండా ఏదైనా ఆఫర్‌ను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు వారి హక్కులు కలిగి ఉన్నారు.

viii) కంపెనీ (లిక్విడేషన్‌లో కలదు) విషయంలో ఆసక్తి కలిగిన సెక్యూర్డ్ క్రెడిటార్స్/ అన్‌సెక్యూర్డ్ & ప్రిఫరెన్షియల్ క్రెడిటార్స్/ కంట్రిబ్యూటర్స్/ఎక్స్-డైరెక్టర్స్/ కేంద్ర & రాష్ట్ర ప్రభుత్వ అథారిటీలు, గవర్నమెంట్/సెమి గవర్నమెంట్/ స్థానిక సంస్థలు మరియు అన్ని ఇతర పార్టీలకు నోటీసుగా ఈ అమ్మకం ప్రకటనను పరిగణించవలెను.

ix) కాగోరు కొనుగోలుదారు ప్రతిపాదిత ఇ-వేలంలో పాల్గొనుటకు ముందు ఏవైనా అవసరమైన వాటికి సంబంధించి తమకుతాము పూర్తిగా సంతృప్తి పడేందుకు ప్రకటన తేది నుండి పైన తెలిపిన తనిఖీ తేది వరకు ఏదైనా పని రోజున **మ.** 2.00 **గం. నుండి మ.** 3.00 గం.మధ్య అఫీషియల్ లిక్విడేటర్, హైదరాబాద్ వారి కార్యాలయాన్ని దర్శించి సంబంధిత భూమి డాక్యుమెంట్లను పరిశీలించుకోవచ్చు మరియు రెవెన్యూ/సంబంధిత అథారిటీల నుండి నేరుగా సంబంధిత రెవెన్యూ రికార్డులు/లొకేషన్ మ్యాప్ కూడా పరిశీలించుకోవచ్చు. భవిష్యత్‌లో దీనికి సంబంధించి ఏదైనా అభ్యంతరం ఉంటే, దానిని అఫీషియల్ లిక్విడేటర్ పరిగణించజాలరు.

x) **అమ్మకం నియమ** నిబంధనలతోపాటు పై ఇ-వేలం యొక్క ఇతర వివరాలు వెబ్‌సైట్ **https://ol.auctiontiger.net**లో లభిస్తాయి.

xi) పై నియమ నిబంధనలను ఏ సమయంలోనైనా గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం/ అఫీషియల్ లిక్విడేటర్ ద్వారా సడలించవచ్చును/ రద్దు చేయవచ్చును/తదుపరిగా పేర్కొనవచ్చును.

సం/-
తేది: 12.11.2024 (U.K. సాహూ, ICLS)
ప్రదేశం: హైదరాబాద్ **అఫీషియల్ లిక్విడేటర్,**
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్

వేములవాడ ఆలయాన్ని అభివృద్ధి చేయాలి: మంత్రి

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తేతెలంగాణ): వేములవాడ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో గురువారం సమావేశం జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ, దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్ పాల్గొన్నారు. సామాజిక బాధ్యత విరాళాల ద్వారా నిధుల అవకాశాలను అన్వేషించాలని మంత్రి సూచించారు.

మహా ఎన్నికలకు మన హోంగార్డులు

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ) : మహారాష్ట్రలో త్వరలో జరగనున్న ఎన్నికలకు రాష్ట్ర హోంశాఖ నుంచి 3వేల మంది హోంగార్డులను పంపనున్నారు. ఆయా జిల్లాల నుంచి ఎవరెవరు ఎలక్షన్ బందోబస్తుకు వెళ్లాలలో లిస్టు పంపారు. వీరంతా శనివారం ఉదయం మహారాష్ట్రకు బయల్దేరనున్నారు.

ఎల్బీ స్టేడియంలో బాలల దినోత్సవానికి వచ్చిన వారికి సరిపడా ఏర్పాట్లు చేయకపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందిపడుతున్న విద్యార్థులు

టాయిలెట్ల వద్ద విద్యార్థినుల క్యూ

ప్రైవేటు టీచర్లకు చదువు, అనుభవంలేవు

- ప్రభుత్వ ఉపాధ్యాయులతో పోల్చితే వారికి చదువు తక్కువ
- ప్రైవేటు స్కూల్లో చేర్చడమే ప్రతిష్ఠగా తల్లిదండ్రులు భావిస్తున్నారు
- యూనివర్సిటీలు గంజాయికి బానిసలయ్యాయి: సీఎం రేవంత్‌రెడ్డి
- బాలల దినోత్సవ సభలో సీఎం తీరుపై టీచర్ల విస్మయం

హైదరాబాద్, నవంబర్ 14(నమస్తే తెలంగాణ): కరకు మాటలు, అనుచిత చేతలతో తరచుగా వివాదాస్పదం అవుతున్న సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి తన తీరును బయటపెట్టుకున్నారు. ప్రైవేటు టీచర్లకు చదువు, అనుభవం లేవని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకున్న అనుభవం, విద్య ప్రైవేటు పాఠశాలల్లో ఉన్నటువంటి టీచర్లకు లేవని తెలిపారు. గురువారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన బాలల దినోత్సవానికి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయులను ఉద్దేశించి రేవంత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 26,854 ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో 26 లక్షల మంది విద్యార్థులు చదువుతుంటే 11వేలకు పైగా ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో 36 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. మీకున్న అనుభవం, విద్య ప్రైవేటు టీచర్లకు లేవు. కానీ పేద తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని ప్రైవేటు పాఠశాలలకు పంపించడమే ప్రతిష్ఠగా భావిస్తున్నారు. దీనిపై ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆలోచించాల్సి అవసరం ఉంది. ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ఠ దెబ్బతింటున్నది. ప్రభుత్వ పాఠశాల్లో అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది అన్నారు. "రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటు చేయాలని మీరంతా తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చారు. తెలంగాణ సమాజం వ్యసనాల వైపు వేగంగా పరిగెడుతున్నది. ఒకప్పుడు సమస